శ్రీ రమణ జ్యోతి | Sri Ramana Jyothi
మే 2023 | May 2023

ఈ సంచికలో ... | IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 106వ ప్రవచనం | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము | తాడిమేటి సత్యనారాయణ | 12 |
| 3. | శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు? | జె. యాదయ్య | 19 |
| 4. | Parikshit | Dr K Subrahmanian | 30 |
| 5. | Ashtavakra Gita - 12 | V Krithivasan | 36 |
| 6. | Ramanatha Brahmachari | V Ganesan | 39 |
| 7. | Ramana's Words | | 44 |
| 8. | Ramana Yoga Sutras | Sri Krishna Bhikshu | 46 |
| 9. | Encounters with Bhagavan | | 48 |

## Events in Sri Ramana Kendram in May 2023

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 24th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# నమ్మకం - ఋజువు

డా॥ కే.యస్. గారి 106వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

ప్రతి రోజూ మన చుట్టూ ఎన్నో పక్షులు, జంతువులు, చెట్లు వివిధ ఆకారాలు, పరిమాణాలతో అగుపడుతూ వుంటాయి. ఎంతో వైవిధ్యం వ్యక్తమవుతుంది. అందుకే ఎవరైనా వున్నది ఒక్కటే అని అన్నప్పుడు మనకు అర్థం చేసుకోవడం కష్టంగా వుంటుంది. కాని అవన్నీ కూడ ఒకే దాని యొక్క ప్రత్యక్ష రూపాలు మాత్రమే. మన మనసు వల్లనే ఆ భేదాలు మనకు అనిపిస్తాయి.

మనుష్యుల విషయమే తీసుకుందాం. వాళ్ళను చూసినప్పుడు ఏమనిపిస్తుంది? జనం పలు రూపాలు, ఆకారాలలో వుంటారు. కాని అందరిలోనూ ఒక విషయం మాత్రం గమనిస్తాం. ప్రతి యొక్కరూ ఏదో ఒక దానిని వాంఛిస్తూ వుంటారు. కొందరు ధనాన్ని ఆశించవచ్చు, మరి కొందరు మోక్షాన్ని కోరుకోవచ్చు. కాని అందరూ ఏదో ఒకటి కావాలనుకొనడం మాత్రం విశదమౌతుంది. మొత్తం మీద ఈ విషయంలో ఒకరి నుండి మరొకరు భిన్నంగా వున్నారని చెప్పలేము. నేను కావాలనుకునేది మరొకరు కోరుకునే దాని కంటే గొప్పది అని అనుకోవచ్చు. అది నా అభిప్రాయం.  నేను ఒకటి కావాలనుకున్నట్లే నీవు మరొకటి వాంఛించవచ్చు.

## కోరడం సాధారణం

ఈ కోరికల లక్షణం మాత్రం అందరిలో సాధారణమైన విషయమని తెలుస్తుంది. ఈ విషయం అవగతమైనప్పుడు అందులో చిన్నది, గొప్పది, అనే ప్రశ్న ఉదయించదు. అయినప్పటికి ఎందువల్లనో మోక్షాన్ని కోరుకునే వ్యక్తి ధనాన్ని ఆశించే వాని కంటే గొప్ప వ్యక్తి అని అనుకుంటూనే వుంటాం. దానికి కారణం అది హానికరం కాదనే భావన. కాని ధనార్జనలో మనసుకు విశ్రాంతి లేనట్లే మోక్షం ఆశిస్తున్న తరుణంలో కూడ మనసు అలాగే కలవరం చెందుతుంటుంది.

మౌలికంగా, కోరిక బాధతో కూడినదని గుర్తించిన క్షణంలో మనకూ ఇతరులకూ భేదం లేదన్నది తెలియవస్తుంది. అంటే, మనం ఇతరుల కంటే గొప్ప కాదని, అలాగే తక్కువ కూడ కాదని అవగత మైనప్పుడు, ఇక కోపం, అసూయలకు తావుండదు. ఇక మనం మోక్షాన్ని కోరుతున్నామని మనలో నమ్రత ఏర్పడుతుంది. బాహ్యంగా కాదు ఆంతర్యంలో నమ్రత ఏర్పడుతుంది. అలాగ కాకుండ ఇతరుల కంటే నేను మెరుగు అన్న అభిప్రాయం కలిగితే, పరిస్థితి కష్టమౌతుంది. ఏ విధంగా గొప్ప అని ఋజువు చేయడానికి ఎన్నో సమర్థనలు చేసుకోవలసి వస్తుంది. అంటే నిజంగా నమ్రత వున్నప్పుడు మనసు ఏ కలవరమూ చెందకుండ వుంటుంది. మతాచారాలు, ఆరాధన మొదలైనవి నాలో నిజంగా లేనప్పుడు, అలాంటివాడినని భావిస్తే మనకు నెమ్మది లేకుండ, వ్యాకులత మొదలౌతుంది. మరెవరో వలె వుండాలని, అనుకోవడం అశాంతికి,

కల్లోలానికి కారణమౌతుంది. ఏకత్వాన్ని గుర్తించి మిగత వారిలాగే నేనూ వున్నానని భావిస్తే ఏ విధమైన వ్యాకులత, అసౌఖ్యమూ వుండవు.

## అన్నీ కలిపితే ఒకటే

లోదృష్టితో గమనించి నాకు యథార్థంగా కావలసినది అంటూ ఏమైనా వుందా అందరూ ఒకటే, ఇక ఏదో ఎవరి వలే కావలసినది ఏముంది అన్న నిజం తెలుస్తుంది, మరే కోరిక అంటూ వుండదు. అంటే ముఖ్యమైనది నీవెవరో తెలుసుకొనడమే. వాంఛించే వాడెవ్వడు అని గమనించడానికి మనకు భగవత్కృప వుండాలి. ఏకత్వాన్ని అర్థం చేసుకోవడం కష్టమే. మనం భావించే భేదాలు బాహ్యంగా కనిపించేవే. ఉదాహరణకు మన శరీర భాగాల విషయానికి వస్తే మనకు కళ్ళు, చేతులూ, కాళ్లు అని విడివిడిగా చూడం. మన శరీరం అంటే అన్నీ కలిపి ఒకటిగా శరీరమని చెబుతాం. ఆ విషయాన్ని మనకు ఎవ్వరూ వచ్చి చెప్పనక్కరలేదు. అన్ని భాగాలు వున్నప్పటికీ, కలిపి ఒకటిగానే వ్యవహరిస్తాం. అలాగే ఈ విశ్వంలో మనకు కనిపించే వృక్షాలు, పక్షులు, జంతువులను అన్నిటినీ కలిపి ఒక విశ్వంగా వ్యవహరిస్తాము. ఒకవైపు అలాగ భావిస్తూనే, అది ఎలాగ అని అర్థం చేసుకొనడం కష్టమనిపిస్తుంది.

బంగారంతో గాజులు, చెవి కమ్మలు, గొలుసులు వంటి ఎన్నో ఆభరణాలు తయారవుతాయి. ప్రతి ఆభరణాన్ని ఏదో బాగుందనీ, మరేదో నచ్చిందని అలా అనుకుంటాము. వాటిని అమ్మాల్సి వచ్చినప్పుడు స్వర్ణకారుని వద్దకు తీసుకు వెళితే అతను విడివిడిగా

పట్టించుకోడు. అందులో ఏ ఆకారంలో వున్న వాటిలో నైనప్పటికీ, మొత్తం వాటిలో బంగారం ఎంత వున్నదన్నదే గమనించి చూస్తాడు. ఎందుకంటే, ఏ రకం ఆభరణం అయినప్పటికీ కరిగించినప్పుడు ఆకారాన్ని కోల్పోయి ద్రవరూపంలో బంగారం అవుతుంది. అతనికి ఆ బంగారం నాణ్యత మాత్రమే ముఖ్యం. కరిగించినప్పుడు మొదట మనం నచ్చి, మెచ్చుకునే వస్తువు యిక వుండదు.

## ఆకారంలో తేడాలు

అలాగే, వడ్రంగి కొయ్యని ఒక పులి బొమ్మ ఆకారంలో చెక్కుతాడని అనుకుందాం. ఆ పులి చూడడానికి నిజం పులి లాగ భయంకరంగా అసలు పులి అనుకొనే విధంగా వుండవ్చు. అదే ఒక చిన్న బిడ్డ దాని దగ్గరికి వెళ్ళడానికి నిజం పులి అనుకుని భయపడుతుంది. తండ్రి అది నిజం పులి కాదని, కొయ్యతో చెక్కిన బొమ్మ పులి, భయపడకు అని చెబుతాడు. ఇది మనకందరికి తెలిసిన విషయమే. అది ఆకారం వల్ల పులి, నిజంగానైతే కొయ్య మాత్రమే. అంటే మనం ఒక ఆకారాన్ని చూస్తే అది దేనితో చేయబడిందని గమనించం. పులిగా అనుకున్నప్పుడు కొయ్య పులి రూపంగా మారుతుంది. అలాగే కొయ్యగా తెలుసుకున్నప్పుడు పులి కొయ్యగా మారుతుంది. వస్తువు ఒకటే అయినప్పటికి, మన అవగాహన మాత్రం వేరేది అవుతుంది.

జ్ఞానికి, మనకు వున్న తేడాలు కూడ ఇలాంటివే. ఈ ప్రపంచంలో కోట్ల కొలది వస్తువులు, జీవాలు వుంటాయి. జ్ఞాని మాత్రం అంతటిని, అన్నింటినీ ఒకటిగానే చూస్తాడు. మనం ఈ

వస్తువుల మూలాన్ని గమనిస్తే, అంటే అన్నిటినీ మొత్తంగా చూస్తే మనకూ భేదాలు తెలియరావు. విశ్వమంతా ఒక బ్రహ్మంగా, మనిషి, జంతువు, స్త్రీ పురుషులు అన్నీ బాహ్యామైన భేదాలు మాత్రమేనని జ్ఞాని తెలుసుకుంటాడు, అన్నింటిలో పరమాత్మను గుర్తిస్తాడు. వస్తువులను నిరంతరం విశ్లేషించి వేరువేరుగా గమనించే మనం సామాన్యులం. మన మనసు నిద్ర యందు ఆత్మలో లీనమైనప్పుడు ప్రతి రోజూ నిద్రలో జరిగినప్పుడు అంతా ఒకటే తప్ప, వేరు అంటూ ఏదీ వుండదు. దేని గురించిన స్పృహ కూడ లేనప్పటికి, ఆనందంగా వుంటాం. ఇది మన సామర్థ్యం వల్ల జరిగేది కాదు, పరమాత్మ కృప ద్వారా ఏర్పడుతుంది. కొందరికి అది ఎక్కువ కాలం పట్టవచ్చు. మరికొందరు శీఘ్రంగానే అనుభవించవచ్చు.

## పక్వత ముఖ్యం

ఒక గింజ మొక్కగా అయ్యేందుకు భూమిలో దాన్ని పాతి పెడతాం, పైన మట్టిని కప్పుతాం. ఒక్కోసారి రెండు, మూడు రోజుల్లో, లేదా ఆలస్యంగా వారం రోజులు కావచ్చు. అప్పుడు మొక్కగా పెరుగుతుంది, క్రమంగా పూవులు, కాయలు కాస్తాయి. కాని ముందు గింజ భూమిలోపల వుండాల్సిందే. అలాగే నమ్రత ముఖ్యం. పూజ, ధ్యానం, జపాల గురించి చెబుతూ ఉండడం వల్ల పెద్ద ఉపయోగం లేకపోవచ్చు. పాతిపెట్టబడిన గింజ, మొక్కగా ఎదిగి, కొమ్మలు, ఆకులు, పువ్వులు, పండుగా మారి, పక్వం చెందిన తరువాత నేలకు రాలుతుంది.

పక్వం చెందని పండు; పుల్లగా, కొన్ని సమయాల్లో చేదుగా వుండి, క్రమంగా కొంత ఆకుపచ్చ, కొంత ఎర్రగా వుంటుంది. ఆ దశలో అది కొంత తియ్యగా, కొంత పుల్లగా వుంటుంది. పూర్తిగా ఎర్రగా మారినప్పుడు బాగా తియ్యగా వుంటుంది. అది అలా దశలు మారుతూ పోతుంది. మనలో కూడ అలాంటివే జరుగుతాయి. మొదటి నుండి కూడ మామిడి తియ్యగా వుండాలని చెప్పలేము. అలా జరగదు. మనలో చాలామంది విషయంలో ఎన్నో అనుభవాలు జరుగుతుంటాయి. మనకు కోపం వస్తుంది, అసూయ ఏర్పడుతుంది, ఎన్నో రకాలైన భయం, మొదలైనవి గమనించవచ్చు. ఈ విషయాల అవగాహన మనకు కలిగినప్పుడు వాటిని మన పరిమితులుగా అంగీకరిస్తాం. ఆఖరుకు మనసులో పక్వత ఏర్పడుతుంది. పక్వానికి వచ్చిన మామిడి పండు లాగా అవన్నీ స్వతహాగా రాలిపోతాయి.

**బాహ్య లక్షణాలు**

ఈ పక్వత చెందడమనేది ఏమిటి? సరియైన సమయం ఆసన్నమైనప్పుడు మనసు హృదయం, ఆత్మలోకి లీనమవుతుంది. ఇది పూజ, జపం ద్వారా సాధింప సాధ్యమా? సాధ్యమే. భగవంతుడిని నాకు అది ఇవ్వు. ఇది ఇవ్వు, అని ఆజ్ఞాపించకు. చేయమన్న దానిని నిర్వహించి మిగతది ఆయనకు వదిలెయ్యాలి. దానికి మూలాన్ని గ్రహించాలి. పూజ, జపం, ధ్యానం చేయడం అందరి విషయంలోనూ మంచిదే. కాని ఇవన్నీ ఆంతర్యంలో జరిగేవి. వీటితో బాటు భగవంతుని కృప ద్వారా బాహ్యమైనవి మరికొన్ని కూడ అవసరం. అహింస (ఇతరులకు హాని

చేయకపోవడం), అస్తేయత (చౌర్యం చేయక వుండడం) అంటే మానసికంగా కూడ, దేనినో కావాలని కోరకుండడం. లేకుంటే ఇవన్నీ సమస్యలకు దారి తీస్తాయి. ఇతరులకు వున్నది మనకు కావాలను కోవడం, అసూయ పనికిరాదు. అలాగే సత్యం. సాధారణంగా మనసు తలచేది, మాట్లాడేది, నిజంగా ఆచరించేది ఒకటిగానే ఉండదు. ఇది లేకపోవడం వల్లనే ఎన్నో కష్టాలు, సమస్యలకు కారణమౌతుంది. అదే మహాత్ములు అక్షరాల ఆచరిస్తారు - మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనే.. భగవత్కృపతో మాత్రమే అది సాధ్యమౌతుంది. ప్రతి క్షణమూ ధ్యానంలోనే గడపడం సాధ్యం కాదు. పూజ, నామసంకీర్తనం అలాగ పలు విధాల భగవంతుని కొలవడం, వాటి వాటి ఉపయోగాలను ఇస్తాయి. అన్నిటికి, నమ్మకం, శ్రద్ధ ముఖ్యం. ఒక విపరీతమైనది ఏమంటే, సాధన విషయానికి వచ్చేసరికి మనము నమ్మకానికి ఋజువు చూపించాలని భావిస్తాం.

**ఋజువు అవసరమా?**

ఇక ఉదాహరణకు, మనం రైలులో ప్రయాణం చేయదలచు కొన్నప్పుడు, దాని డ్రైవరు ఎవరు, గార్డు ఎవరు అన్నవి మనకు తెలీదు. డ్రైవరు శిక్షణ పొందిన వాడా, అతను రైలు నడిపినప్పుడు ప్రమాదాలు ఏవైనా జరిగాయా అలాంటి ప్రశ్నలు అడగం. టికెట్ కొన్న వెంటనే రైలు ఎక్కుతాం. డ్రైవరు సామర్థ్యవంతుడే, మనం వెళ్ళాల్సిన చోటికి తీసుకు వెళ్తాడన్న నమ్మకం ఉండడం వల్ల అలాగ చేస్తాం. దిగులు ఏమీ ఉండదు. మనం ఏదైనా తిన్నప్పుడు అది జీర్ణమౌతుందని నమ్ముతాం. తింటున్నది మనకు మంచిది

కాదన్నప్పటికి, కడుపు దాన్ని సర్దుతుందన్న నమ్మకం ఉంటుంది. తిన్న తరువాత లోపల జీర్ణక్రియ జరుగుతోందా అన్న దాని గురించి పట్టించుకోము. ఇది అసాధారణమైనది. అలాగే మరొక విషయం. ఇరవై నాలుగు గంటలూ మనం గాలి పీలుస్తాం, కాని దాని ధ్యాస మనకు ఉండదు. శ్వాసక్రియ జరుగుతూ పోతుంది. శవాన్ని చూసినప్పుడు లేదా ఎవరైన తీవ్ర అనారోగ్యంతో వున్నారనప్పుడు శ్వాస గురించి ఆలోచిస్తాం. మనం శ్వాస పీల్చుకొనడానికి ఇబ్బంది పడినప్పుడు అది గుర్తుకు వస్తుంది. మన శ్వాస క్రియ మనం జరపాల్సిందే, ఎదుటి వారు కాదు. అప్పుడు తిరిగి శ్వాస సక్రమ మయ్యేవరకు మరణం గురించిన ఆలోచన రావచ్చు.

## నిమిత్త మాత్రులం

ధ్యానం మనసు పరిధిని దాటిన స్థాయికి తీసుకు వెళుతుంది. మనం అసలు మనసునే అవగాహన చేసుకొనలేము. అద్భుతాలను గురించి మాట్లాడతాం. ఇబ్బందులలో వున్న వారెవరో వచ్చి చెప్పుకుంటారు. ఏమీ ఆశించక మనకు తోచిన సలహా ఇచ్చి అంతా బాగుంటుందని చెబుతాం. అలాగే మంచి జరగవచ్చు. దానితో, మన వల్ల ఆ ఫలితం జరిగిందా? మనం సలహా ఇచ్చినప్పుడు ఆ ఫలితాన్ని గుర్తించి చెప్పామా? ఎవరి గురించి గాని, మనం ఎంతో బాగు కోరిన వారి విషయంలో అలాగ జరిగి వుండవచ్చు. దానికి ఋజువు కావాలని కోరితే, ఇవ్వగలమా. జీవితంలో పలు విషయాలను మనం ఫలానా విధంగా జరిగినందుకు సమర్థించుకొనడం కుదరదు.

కాని నమ్మకం అన్నది ఒకటి వుంది. ప్రక్కరోజు ఉదయం తిరిగి లేస్తామన్న నమ్మకంతో నిద్రిస్తాం. మనం అనుమానాల పుట్ట అయితే సరిగా నిద్రించలేము. నిత్య జీవితంలో సాధారణంగా జరిగే వాటి గురించి అనుమానాలు వుండవు. అలాంటి నమ్మకమే మనం సాధన, ధ్యానం, పూజల విషయంలో కూడ కలిగి వుండాలి. వాటిని కొనసాగిస్తాను, వాటి ఫలితాలు ఎలా వుంటాయన్నది పట్టించు కోను అని నమ్మికను కలిగి వుండాలి. సాధన సవ్యంగా చేస్తే జరిగే ప్రతి దానిని అంగీకరిస్తాం. క్రమేపి, మన అధీనంలో ఏమీ లేదని, విధులను నిర్వర్తించే దృక్పథం ఏర్పడుతుంది. అలాంటి ధోరణి అలవడినప్పుడు దేని గురించీ భయం వుండదు. భయాలు లేని పరిస్థితుల్లో అన్నిటినీ సమ్మతించి అతి సంతోషవంతంగా వుండ గలుగుతాం. గర్వం దరిచేరదు. మన వల్ల కాదు, మరేదో ఉన్నత శక్తి కారణమని అవగతం అవుతుంది. ఆ శక్తి పనిచేయనప్పుడు ఒక క్షణం కూడ మనగలగడం కుదరదు. గాంధీజీ తమకు బాహ్యంగా రక్షణ బృందం ఏదీ అక్కఱ లేదన్నారు. దేవుని నిర్ణయం తమను ఈ ప్రపంచం నుండి తీసుకు పోవాలని వుంటే, ఏ రక్షణా ఏమీ చేయలేదని వాదించారు. అలాంటి నిర్భయత్వ ధోరణి చాలా ముఖ్యం. అందరిలోను మనల్ని, మనలో అందర్నీ చూడ గలుగుతాం. దానిని అలవరచుకోవాలి.

బాహ్యంగా కనిపించే భేదాలు కల్పితాలు, అలాగ కనిపించేవి మాత్రమే. భగవాన్, మరెందరో సాధువులు, జ్ఞానులు ఇదే మాటను చెప్పారు. తత్త్వం అసి, అప్పుడు దైవకృపతో అహం అణగి, వ్యక్తిత్వం భావన నశిస్తుంది.

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 68వ పద్య తాత్పర్యము

అన్ని అవస్థల యందునూ, ఏ విశేషముచేతనూ హాని జరగ కుండ, తప్పు కలుగక ఆత్మచింతన యగు యోగములో మనస్సు నిలిపినవాడై, ఏ కారణముచేతనైననూ, ఏ విధముగనైననూ కలుగు సందేహముచే, క్షేత్రములలోను, అందలి పీఠములలోనూ సేవ చేయవలెనను కుతూహలము తిరిగి కలిగినచో, దీనిని మార్చి వేయుము. త్రోసి వేయుదువుగాక.

## వ్యాఖ్య

జీవుని అన్ని అవస్థల యందును, ఏదో ఒక విశేష కారణము చేత, ఆత్మ యోగమునకు హాని కలుగునట్లయినచో, ఆ హాని జరగకుండ దానిని నిర్మూలించి, ఆత్మచింతనయందు మనస్సు లగ్న పరచవలెను. అట్లు మనస్సు లగ్నమయినపుడు, ఏ కారణము చేతనైనను మనస్సున తోచు సందేహములవల్ల క్షేత్ర సేవలు క్షేత్ర పీఠాధిపతియైన భగవంతుని సేవలో కుతూహలము కలిగినచో, ఈ మోహమును మార్చివేయుము. ఎప్పటిలాగనే ఆత్మనిష్ఠుడవై యుండుము అని ఉపదేశించు చున్నారు. క్షేత్రపీఠ మనగా క్షేత్రదేవత అధిష్ఠించిన పీఠము. ప్రారంభ కాలములో జ్ఞానాభ్యాసి ఆత్మవిద్యను పొందుటకై, అనేక తీర్థములను దేవతలను సేవించి ఈ స్థితికి చేరియున్నాడు. ఇప్పుడు యితను ఆత్మచింతనలో మునిగి యున్నప్పుడు, లోపల అణిగియున్న వాసనాబలముచే ఒకానొక

సమయములో అవి బహిర్గతమై సేవ చేయుటకు కుతూహలము కలుగ చేయుచున్నవి. ఇదివరలో వాటిని మనస్ఫూర్తిగా చేయుట వల్ల కుతూహలము కలుగుట సహజమే. కాని సద్వస్తువును తెలిసి కొనుటకు యివన్నియూ అడ్డంకులే. అందువల్ల ఏ కారణము చేతనైననూ "అయ్యో వాటిని చేయకుండా వదలివేశామే" యన్న సందేహముచే దుఃఖము, సేవచే ఆనందము కల్గిన యెడల కొంచమైననూ దానికి చోటివ్వకుమని భావము.

## 69వ పద్య తాత్పర్యము

ప్రియసతి! వినుము. జ్ఞానాభ్యాసియగు మంచి వివేక వంతుడు, సత్య జ్ఞానమగు జ్ఞానస్వరూపమును ఆశ్రయించిన మనస్సు గలవాడై యుండ వలెను. క్రిమి, కీటకము, పక్షి, చెట్టు, వృక్షము, తీగ మొదలగు రూపములలో గల జంగమములు స్థావరములు మొదలగువానికి, ఏ ప్రాణికిని ఎన్నడైననూ నాశనము కలిగించునట్టి ఏ కార్యమును చేయకూడదని తెలిసికొనుము.

## వ్యాఖ్య

ముముక్షువగు జ్ఞానాభ్యాసికి అహింసావ్రతమే అతి శ్రేష్ఠ మైనది. తాను ప్రత్యక్షముగా నాశము చేయకపోయిననూ, పరోక్షముగా కూడ వాటి నాశమునకు కారణమగు వాటిని చేయకూడదు. వివేకవంతుడైన సాధకుడు, ఏ ప్రాణికి హాని తలపెట్టక, ఆత్మ స్వరూపమును ఆశ్రయించినవాడై యుండుటయే మంచి లక్షణము. సకల ప్రాణులు భగవంతుని రూపములగుటచే, దేనిని నాశమొనర్చకూడదు. ఈ అహింసా వ్రతమును చేబట్టినచో అదియే అతనిని ముక్తి తీరమును చేర్చును.

## 70వ పద్య తాత్పర్యము

వివేకవంతుడైన సాధకుడు, పూజ కొరకు ఏ వేరు కూడా తెంప కూడదు. ఒక్క ఆకును కూడ కోసి చెట్టు నుండి వేరుచేయు పనులను చేయకూడదు. లోకము నందుగల ఏ ప్రాణులకు ఆగ్రహముచే హాని కలుగచేయు పనులను చేయవద్దు. అందమైన పుష్పములను దయదాక్షిణ్యములు లేక పూలమొక్కల నుండి కోసి వేరుచేయవద్దు.

## వ్యాఖ్య

69వ పద్యమును పోలినదే ఇదియును. అహింసా ధర్మమును సాధకుడు పూర్తిగ అనుష్ఠించవలసినదని నొక్కి చెప్పుచున్నారు. అన్ని ప్రాణులకునూ, చెట్లు చేమలకూ నాశనము కలుగచేయవద్దని మొదట సాధారణముగ అందరికి వర్తించునట్లు చెప్పబడినది. అయితే ఈ శ్లోకములో దేవుని పూజ కొరకు కూడ దేనిని కోయ వద్దని తెలుపుచున్నారు.

ఆహ్లాదము నిచ్చునని చెప్పబడు వట్టివేరు వంటి సువాసనగల ఎటువంటి వేరునైననూ, దేవుని పూజ కొరకు కూడా వాటిని త్రుంచ వద్దు. ఆ విధముగనే పవిత్రమైనది, సువాసన గలదైన, తులసి, బిల్వము, దవనము వంటి పత్రములను (ఆకులను) చెట్టు నుండి నిరాధారముగ కోయవద్దని మనసు ద్రవించునట్లు చెప్పుచున్నారు. పుష్పములనో, ఆకులనో చెట్ల నుండి వాటిని త్రుంచిన, చెట్ల నుండి విడిపడిన అవి నిరాధారమగుచున్నవి యని తలచుట అత్యుత్తమ మైన ఆచార వ్యవహారము. మంచి సంప్రదాయము. ఇదే అహింసా తత్వము యొక్క పూర్ణత్వము. దేవుని సృష్టియందలి అన్నిటిని తన

వలెనే తలచి, వాటికి ఎటువంటి చెడు కల్గించక యుండుటయే ఈశ్వరునికి చేయు ఉత్తమ పూజ యగును.

ప్రాణులు ఎంతటి దుష్టమైనవి యైననూ, వాటికి కోపములో గూడ ఎటువంటి కష్టము కలిగించవద్దని ఆజ్ఞాపించుచున్నారు. ఇటువంటి దయా స్వరూపుడగు అహింసామూర్తిని చూచునపుడు, ఆ దుష్ట జంతువులు తమను, తమ దుష్ట స్వభావచర్యలను మరచి, తాము గూడా సాధుజీవుల వలె మారుచున్నవి. దీనికొక ఉదాహరణ: ఈశాన్య జ్ఞాన దేశికుల సన్నిధిలో రెండు పెద్ద పులులు ఆయన పక్కన మేకపిల్లల వలె సాధువులుగనూ, శాంతముగనూ పరుండి యుండునని చరిత్ర చెప్పుచున్నది.

ఏ ప్రాణులను హింసించక, తాను ఎవరివల్లనైన హింసింప బడినను, దేని మీదను కోపమో, అసహ్యమో చెందక, ఆ విధముగనే తనమీద వాటికి కూడ కోపమో అసహ్యమో లేక జీవించుటయే జ్ఞాని యొక్క లక్ష్యము లక్షణమగును.

పుష్పమును కూడా చెట్టునుండి త్రుంచవద్దను దానిని భగవాన్ శ్రీరమణుల కాలమందు జరిగిన ఒక సంఘటన మనకు నిదర్శన ముగా కనబడుచున్నది. తిరుచ్చుళి లక్షి అమ్మాళ్ భగవానునితో బాల్యమున ఆడుకొన్నవారు. ఆమె పుట్టిన గ్రామము కూడా తిరుచ్చుళియే. భగవానుని యెడల ఎంతో భక్తి ప్రేమ గలిగిన వారు. భగవానునితో సహజముగ సన్నిహితముగా మెలగువారు. భగవాన్ కూడా ఆమెను 'లక్ష్మీ'యని పేరుతో పిలిచి మెలిగెడివారు.

ఈ రోజు భగవాన్ తన అనుచరులతో గిరిప్రదక్షిణమునకై బయలుదేరిరి. లక్ష్మి అమ్మాళ్ కూడా వారితో చేరిరి. శోణతీర్థము చేరగనే అక్కడ వారందరు కొంతసేపు విశ్రాంతికై ఆగిరి. అక్కడనే

శోణతీర్థమునకు సమీపమున త్రోవ ప్రక్కనే ఒక పూలచెట్టు చక్కటి పూలు గుత్తులుగా పూసియున్నది. దానిని చూచిన లక్ష్మి అమ్మాళ్ పూలను కోయుటకు ప్రారంభించిరి. ఇంతలో అందరు ప్రదక్షిణమునకు సిద్ధపడిరి.

కొంచము దూరములో పూలు కోయుచున్న లక్ష్మి అమ్మాళ్‌ని చూసిన భగవాన్ ఆమె దగ్గరికి వెళ్ళి "లక్ష్మీ! ఏమి చేయుచున్నావు? అని అడిగిరి. ఇది విన్న లక్ష్మి అమ్మాళ్ అదిరిపడి "పూజకు పూలు కోయుచున్నాను భగవాన్" అన్నారు. అంతకు ముందే పూలు కొన్ని కోసినవి క్రింద పరచిన గుడ్డపై పోయబడి వున్నవి. వాటిని చూసిన భగవాన్ "అవిగో చాలా పువ్వులు ఉన్నాయిగదా! ఇంకా ఎందుకు కోసెదవు? అనిరి. బదులుగా ఆమె భగవాన్‌తో "ఈ చెట్టు పుష్పించి చక్కగాయున్నది. ఈ పుష్పములన్నియు పూసి వృధాయగునే, అందుకే అన్నిటిని కోయుచున్నాను" అని చెప్పిరి. అది విన్న భగవాన్ "అవునవును నీవే గదా దానిని నాటి నీరుపోసి పెంచితివి! ఆ హక్కు కూడ నీకు ఉండకూడదా! అది పూచి అట్లేయుండిన అందముగా వుండదా? దాని అందమునంతా నీవే అనుభవించితివి. వేరెవరు దాని అందమును చూడగూడదు కదా. ఆ చెట్టును పూర్తిగ బోడిచేసేయ్. అదే పూజకు ఫలము" అనిరి.

అది విన్న లక్ష్మి అమ్మాళ్ దిగ్భ్రాంతి చెందిరి. తను చేసిన తప్పును గ్రహించి బాధపడిరి. దాని తర్వాత ఆమె ఎప్పుడైనను పూలు పూచిన చెట్లను చూచిన "ఈశ్వరా! భగవాన్! నీకే అర్పణము" అని మానసికముగా అర్పించి చేతులు జోడించి జపించేవారు. పూవులను అనాదరముగా త్రుంచవద్దని చెప్పుటకు ఇంతకంటే వేరు ఉదాహరణ గలదా?

## 71వ పద్య తాత్పర్యము

మనము కోయకుండా, వాటంతట రాలిన నిర్మలమైన స్వచ్ఛమైన పూలను ఏఱి, వాటితో శివునికి తగిన పూజ చేయుటయే ధర్మమగును. ఇదియే శివభక్తుని ఉత్తమ పూజయగును. ఈ ఉత్తమ పూజను వదలి, మంత్రములను జపించి కీడు కలుగచేయుట, మంత్ర ప్రయోగములచే పూనకము ఆవాహనము చేయుట, విడిపించుట, అను వాటిని చేయుట, ఇంకా విరోధములు కల్గించుట, ప్రసిద్ధి చెందిన స్తంభనమూ, మరియు తగదు.

## వ్యాఖ్య

ముందటి 70వ వచనములో ఏ ఆకును, పూవును కోయవద్దని చెప్పగా, శివపూజ చేయు భక్తునికి ఏమి మార్గము అని సంకోచించ కుండా యుండుటకు తానే ఒక మార్గమును సూచించుచున్నారు. పూజ కొరకే వాటంతటరాలిన సుగంధ పుష్పముల నేరి పూజింపుము. అదే నీవు చేయవలసిన కర్తవ్యము అని అను చున్నారు. ఇంత శ్రేష్ఠమైన పూజను కాదని క్రింద చెప్పబడిన కఠోరమైన మంత్రోచ్చారణను చేయుటకు ఎప్పటికీ ఆలోచించకుము. అవి యేవనగా.

తన కిష్టములేనివాటినో, లేక లేనివాళ్ళనో, మంత్రములను కంఠస్థము చేసి జపించి ఆ మంత్రశక్తిచే నాశమొనర్చుట. ఇది మారణము. మారణ హోమము మృత్యువునే కలుగజేయును. దారుకా వనమున ఋషులు శివుని అంతమొనర్చుటకు చేసిన హోమము యిటవంటిదే. ఆ హోమగుండము నుండి కలిగిన

వన్నియు శివుని అంతమొనర్చుటకే సృష్టించినవి తనకు విరోధులైన వారిని, అవసరముకాని వారిని తరుముటకు, తమ వద్ద కావలసిన శక్తియో సంపదయో వుండదు. అప్పుడు యీ ఉచ్చాటన మంత్రమును జపించి దాని ద్వారా తరిమి గొట్టుట. తరిమి గొట్టుటలో ఈ మంత్రము అతిశక్తివంతమైనది. దేనినే ఉచ్చాటన మని యందురు. విడిచి వుండలేని ప్రాణ మిత్రులను వారి స్నేహమును చూసి ఓర్వలేక వారి మధ్య భేదములు సృష్టించి విరోధము సృష్టించు మంత్రమే "ద్వేషణ" మనబడును. బుద్ధి కుశలతలు కలిగి, పేరు ప్రతిష్టలు పొంది, సిరిసంపదలతో జీవించు గుణవంతులు మేధావులను నోళ్ళుపడిపోవునట్లు స్తంభింపచేయు మంత్ర శక్తి "స్తంభనము" అని చెప్పబడుచున్నది.

ఈ మంత్ర ప్రయోగము వల్ల, తెలివితేటలు పోగొట్టుకొని, పేరు ప్రతిష్ఠలు దిగజారి, బుద్ధి క్షీణించి, మనోధైర్యము నశించి, వాక్చాతుర్యము బొత్తిగ లేక మూగవానివలె, ఉన్మత్తునివలె స్తంభించి పోవుచున్నాడు. ఇతరుల మహోన్నతమైన మంచి జీవితమును చూచి సహించలేక, అసూయచే ఈ కఠోరమైన మంత్రమును ప్రయోగించి, మేధావులను స్తంభింప జేయువారు నీచులలో నీచులు, మహాదుష్టులు.

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు

శ్రీ జె. యాదయ్య

నా పేరు జూలూరి యాదయ్య. మా నాయనగారి పేరు వెంకయ్య. మా అమ్మ గారి పేరు దామోదరమ్మ. ముందుగా జన్మ నిచ్చినందుకు వారి పాదపద్మములకు నా నమస్సుమాంజలులు. అలానే సద్గురువైన భగవాన్ శ్రీ రమణ మహర్షి పాదపద్మములకు సాష్టాంగ ప్రాణమములు అర్పిస్తూ, నేను భగవాన్ మార్గంలోకి ఎలా వచ్చానో, నాకు గుర్తున్నంత వరకు వివరిస్తాను.

మా అమ్మగారు గొప్ప భక్తురాలు. నేను ఐదవ తరగతి చదువు తున్నప్పుడు మా అమ్మగారు నాకు ఉపదేశించిన విషయాలు: మొదటి ఉపదేశం ఏంటంటే, ఎప్పుడైనా భయం వేస్తే "హరే రామ, హరే రామ, రామ రామ, హరే హరే, హరే కృష్ణ, హరే కృష్ణ, కృష్ణ కృష్ణ, హరే హరే" అని అనుకోమని. నేను అలానే నడుచు కొన్నాను. రెండవది జీవించినంత కాలం మహాత్ముల దర్శనం చేసుకోవటం చాలా మంచిదని చెప్పడం. అప్పటి నుండి వీలును బట్టి మహాత్ములను దర్శించుకుంటూ ఉన్నాను. భగవాన్ అనుగ్రహంతో నాకు అనుకూలవతి ఐన భార్య లభించింది. నా శ్రీమతి పేరు వరలక్ష్మి. నా సాధనలో తన పూర్తి సహకారం అందుతోంది. నాతో పాటు అన్ని సత్సంగాలలో పాల్గొంటుంది. ఆమెకు కృతజ్ఞతలు. నేను రామకృష్ణ మఠానికి రెగ్యులర్‌గా వెళ్ళేవాడిని. అక్కడ శనివారం కమలా జయరావు గారు, ఆదివారం శ్రీ రంగనాదానంద స్వామి

వారి ప్రవచనాలను వినేవాడిని. 1982లో మేము శ్రీ విద్యా ప్రకాశ నంద గిరి స్వామి వారి ప్రవచనాలకు వెళ్ళడం జరిగింది. ప్రవచనంలో భాగంగా, తిరువణ్ణామలైలో భగవాన్ రమణ మహర్షి అని ఉండేవారు, వారు ఎవరు వచ్చినా, ''వచ్చిన దారినే వెళ్ళండి'' అని చెప్పేవారు అని అన్నప్పుడు, నాకు ''వచ్చిన దారినే వెళ్ళండి'' అనే వాక్యంలోని అంతరార్థం అప్పుడు అర్థం కాలేదు. భగవాన్ ''నేను'' అనేది ఎక్కడినుండి వస్తున్నదో గమనించి అక్కడికి వెళ్ళ మని చెప్పారు అనేది తరువాత అర్థమయ్యింది. అది విన్న నాటి నుండి నాకు భగవాన్‌ను గురించి తెలుసుకోవాలనే తపన మొదలయ్యింది. ఆ తపన 1984లో నెరవేరింది. మా ఇంటికి శ్రీరామకృష్ణ ప్రభ'' అనే మాస పత్రిక వచ్చేది. అందులో ''శ్రీరమణ జ్యోతి'' మాస పత్రికకు సంబంధించిన ఒక ప్రకటన ఉన్నది. ''శ్రీరమణ జ్యోతి'' మాస పత్రిక కావాలనుకొనే వారు శ్రీ దోషి గారు,కఠియావార్ స్టోర్స్, ఆబిడ్స్‌లో కలవవచ్చు అని ఉన్నది. వెంటనే మా తమ్ముడు లక్ష్మయ్యను అక్కడికి పంపాను. అప్పుడు సంవత్సరము చందా 6 రూపాయలు. శ్రీ దోషి గారు ఆప్యాయంగా చందా తీసుకొని రెండు, మూడు పాత మాస పత్రికలు ఇవ్వటం జరిగింది. శ్రీ దోషి గారు ఆంధ్ర మహిళా సభలో ప్రతీ ఆదివారం జరుగు సత్సంగం గురించి చెప్పి, మీ అన్నను వీలుంటే వెళ్ళమని చెప్పినారు. కానీ నేనప్పుడు రెగ్యులర్‌గా శ్రీరామకృష్ణ మఠానికి వెళ్ళేవాడిని. అందువల్ల నాకు శ్రీరమణ కేంద్రానికి వెళ్ళాలని అనిపించలేదు. ఆ రోజులలో ''శ్రీరమణ జ్యోతి'' మాస పత్రికలో

ప్రచురితమయ్యే తెలుగు వ్యాసంగాలను చేతివ్రాతతో, ఆంగ్ల వ్యాసంగాలను ఆంగ్లములో టైపు చేసి సైక్లోస్టైల్ చేసి పంపేవారు. అలా కొన్ని రోజులు గడిచింది.

నేను చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థలో ఇంగ్లీష్-కమ్-తెలుగు టైపిస్టుగా పనిచేసేవాడిని. నేను తెలుగు స్టెనోగ్రాఫర్‌ను. ఒక నెల "శ్రీరమణజ్యోతి"లో ప్రచురితమైన తెలుగు వ్యాసంగాలు చదవటానికి వీలుగా లేదు. ఆ నెల "శ్రీరమణ జ్యోతి"ని చూసిన తరువాత భగవాన్ నాకు ఒక ఆలోచనను కలుగజేసినారు. శ్రీరమణ కేంద్రం వెళ్లి, అక్కడి వారిని అడిగి తెలుగు వ్యాసంగాలను తీసుకొని టైపు చేసి ఇవ్వాలనే ఆలోచనను భగవాన్ నాకు కలుగ జేసినారు. దాంతో ఒక ఆదివారం నాడు నేను రమణకేంద్రం వెళ్లాను. అలా వెళ్ళినపుడు నాతోపాటు తెలుగులో టైప్ చేసిన ఒక బుక్‌ను తీసుకొని వెళ్లాను. సత్సంగం అయిన తరువాత శ్రీ రమణజ్యోతి ప్రచురణను ఎవరు చూస్తారు అని అడిగాను. అప్పుడు అక్కడున్న వారు శ్రీ జి.వి. రాజేశ్వర రావు గారిని చూపించారు. నేను వారి దగ్గరకు వెళ్లి, నమస్కారం చేసి, సర్ నాకు తెలుగు టైప్ చేయటం వచ్చును. కాబట్టి నేను ఏమి టైప్ చేయాలో ఆ వ్యాసంగాలను మరియు స్టెన్సిల్స్ నాకు ఇచ్చినచో టైప్ చేసి ఇవ్వగలనని చెప్పాను. దానికి వారు ఎంతో సంతోషించారు. అంతకు 15 రోజుల ముందు, వారికి ఒక పాఠకుడు తెలుగు వ్యాసంగాలను కూడా టైప్ చేస్తే బాగుంటుందని ఉత్తరం వ్రాశారట. అలా ఉత్తరం రావటం, 15 రోజుల తరువాత నేను వెళ్లి వారిని కలవడం భగవాన్ నిర్ణయంగా భావిస్తాను.

శ్రీ జి.వి. రాజేశ్వరరావు గారు నన్ను రాంనగర్‌లో వారుంటున్న ఇంటికి తీసుకొని వెళ్ళారు. నా యొక్క యోగక్షేమాలను గురించి విచారించి తెలుగులో నేను టైప్ చేయవలసిన వ్యాసంగాలను మరియు స్టెన్సిల్స్ ఇవ్వడం జరిగింది. శ్రీ రాజేశ్వరరావు గారెంతో ప్రేమ స్వరూపులు. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. అలా ప్రతినెల తెలుగు వ్యాసంగాలను టైప్ చేసి ఇచ్చే అవకాశం భగవాన్ నాకు ఇచ్చారు. కేంద్రానికి వచ్చిన కొద్ది రోజులకు శ్రీ జి.వి. నరసింహా రావుగారు, ఒకరోజు సాయంత్రం నన్ను డా. కే.యస్. గారింటికి తీసుకొని వెళ్లి, వారితో నా గురించి అన్ని విషయాలు చెప్పారు. ఆ రోజున దాదాపు 45 నిమిషములు డా.కే.యస్.గారితో గడిపే అవకాశం నాకు కలిగింది. డా. కే.యస్. గారు అంతా విని చాలా సంతోషించారు. డా. కే.యస్. గారి లెటర్స్ నన్ను ఎంతగానో ఆకర్షించాయి. దాంతో నేను శ్రీరమణ కేంద్రానికి రెగ్యులర్‌గా రావటం మొదలు పెట్టాను. 1970 సంవత్సరంలో నేను నేర్చుకొన్న తెలుగు టైప్‌రైటింగ్ ఈ విధంగా భగవాన్ సేవ చేయడానికి ఉపయోగపడింది. అలా నేను నేర్చుకొన్న తెలుగు టైప్ రైటింగ్ నన్ను శ్రీరమణ కేంద్రానికి తీసుకు రావడం జరిగింది. ఈ విధంగా నేను భగవాన్ శ్రీరమణ మహర్షి మార్గంలోకి వచ్చాను.

1984వ సంవత్సరంలో మేము మొదటిసారి శ్రీరమణాశ్రమం వెళ్ళటం జరిగింది. భగవాన్ దయతో, శ్రీ బలరామరెడ్డిగారిని మొదటిసారి దర్శించటం జరిగింది. అప్పటి నుండి ఎప్పుడు ఆశ్రమానికి వెళ్ళినా వారి దర్శనం చేసుకొనేవాళ్ళం. వారు మమ్ములను ఎంతో ప్రేమతో ఆశీర్వదించేవారు. ఆశ్రమంలో

భగవాన్‌కు సేవ చేసిన శ్రీరామస్వామిపిళ్ళై, శ్రీ కుంజుస్వామి, శ్రీ కృష్ణ స్వామి, శ్రీమతి కనకమ్మాళ్ మొదలగు గొప్ప భక్తులను దర్శించుకొనే భాగ్యం కూడా మాకు కలిగింది. అలానే జర్మన్ భక్తురాలు లూసిమాను కూడా దర్శించుకొనే భాగ్యం మాకు కలిగింది.

భగవాన్ అనుగ్రహంతో హైదరాబాద్‌లో మేముంటున్న ఇంటికి శ్రీ వేంకట రామన్ గారు (అప్పటి శ్రీరమణాశ్రమం ప్రెసిడెంట్) వచ్చి మా ఇంటిని పావనం చేశారు. అలానే శ్రీ వెంకట రామన్ గారి తరువాత ప్రెసిడెంట్ ఐన శ్రీ సుందరం గారు రెండు సార్లు, శ్రీ జిన్నూరు నాన్నగారు రెండు సార్లు, శ్రీ గెంటేల వేంకట రమణ గారు ఒకసారి, అలానే డా. కే.యస్.గారు నాలుగుసార్లు మా ఇంటికి వచ్చి మమ్ములను అనుగ్రహించారు. వారందరికీ మా కుటుంబ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వీలున్నప్పుడల్లా మా పిల్లలను శ్రీరమణ కేంద్రానికి తీసుకొని వచ్చేవాళ్ళం. డా.కే.యస్. గారి అనుగ్రహం మా పిల్లల మీద పుష్కలంగా ఉంది అని చెప్పగలను.

భగవాన్ అనుగ్రహం వల్ల తరచుగా ఆశ్రమానికి వెళ్తున్నాము. అలానే అప్పటి నుండి ఇప్పటి వరకు భగవాన్ దయతో శ్రీరమణ కేంద్రానికి కూడా రాగలుగుచున్నాము. నా భార్య, బిడ్డ, కొడుకు మరియు కోడలు అందరు కూడా శ్రీరమణ మార్గంలోనే ఉన్నారు. శ్రీరమణ మార్గంలో నాకు ఎన్నో అనుభూతులు, ఆనందకరమైన సంఘటనలు ఉన్నా వాటిలో కొన్నింటిని ఇక్కడ పంచుకోదలచాను. 1990లోనో 91వ సంవత్సరంలోనో ఒక అద్భుతమైన సంఘటన

జరిగింది. అదేమిటంటే మేము ఆశ్రమంలో ఉన్నన్నాళ్ళు ప్రతీ రాత్రి 9 గంటల వేళ నేను, నా శ్రీమతి, భాస్కర్ రావు గారు, వారి శ్రీమతి మధుమతి గారు, రామకృష్ణ (ఓ.టి.సి.) గారు మరియు ఇంకొక స్వామీజీ కలిసి గిరిప్రదక్షిణకు వెళ్ళేవాళ్ళం. అలా ఒకరోజు నేను, నా శ్రీమతి మరియు మధుమతి గారు ముందు నడుస్తూ ఉన్నాము. మిగిలిన ముగ్గురు మా వెనుక వస్తూ ఉన్నారు. కానీ కొంచెం సమయం తరువాత మా మధ్య దూరం పెరిగింది. వాళ్ళు మా వెనకనే వస్తున్నారు కదా అని ధైర్యంగా ముందుకు సాగిపోయాము కానీ వాళ్ళు నడుస్తున్నప్పుడు ఒక కోతి వచ్చి స్వామీజీ వస్త్రాలను చింపి వేయటంతో వారు ముగ్గురు మరల ఆశ్రమానికి తిరిగి వెళ్ళారనే సంగతి మాకు తెలియదు. అదేకాక ఆ రోజు అమావాస్య కావటంతో ప్రదక్షణ చేసే మార్గంలో చీకటిగా ఉన్నది. సగం దూరం నడిచేటప్పటికే మధ్యరాత్రి దాటింది. చినుకులు పడటం ప్రారంభ మయ్యింది. అప్పుడప్పుడు ఆకాశములో మెరిసే మెరుపులతో కొండ తళుక్కుమని మెరుస్తోంది తప్ప ఇంక ఏమి కనిపించటం లేదు. మధుమతి గారు అటుగా వస్తున్న ఒకరిద్దరిని వెనక ముగ్గురు మగవాళ్ళు వస్తున్నారా అని అడుగుతూ ఉంటే నా శ్రీమతి అలా అడగవద్దు అని వారిని వారిస్తూ ఉన్నది. కొంచెం సేపైన తరువాత మాలో భయం మొదలైంది. అప్పుడు నా శ్రీమతి మదిలో ఒక ఆలోచన వచ్చింది. ఈ సమయంలో ఏదైనా ఒక ఆటో వచ్చి టౌన్‌లో దించితే బాగుంటుందని అనుకొన్నది. ఐదు నిమిషాల్లో ఒక వాహనం మావైపుగా వస్తోంది. వచ్చే వాహనం ఆటో కాదు ఏదైనా రెండు చక్రాల బండి అయ్యుంటుందని నేను అన్నాను. కానీ చూస్తే

అది ఆటోనే. ఆటో నడిపే వ్యక్తి మా దగ్గరికి వచ్చి ఆటో కావాలా అని అడిగాడు. కానీ నేను, నా శ్రీమతి మరల ఇలా అనుకొన్నాము. అంత దూరం నడిచాము కదా మిగిలిన దూరం ఎలాగైనా నడిచేద్దాము అని అనుకోని ఆటో నడిపే వ్యక్తితో ఆటో అవసరం లేదని చెప్పాము. ఆ ఆటో నడిపే వ్యక్తి అటుగా వెళ్తూ మమ్మల్ని అడిగాడని అనుకొన్నాము. కానీ ఆ వ్యక్తి వచ్చిన దారినే ఆటోను వెన్నక్కు మళ్ళించి వెళ్ళిపోయాడు. కొద్ది క్షణాలలో ఆ ఆటో అదృశ్యమై పోయింది. ఆ సంఘటన మాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఇంకొకసారి మేము యోగి రామ్‌సూరత్ కుమార్ గారిని దర్శించుకోవటానికి వెళ్ళాము. నాకు వారిని చూసినప్పుడు వారి ఫోటో నా దగ్గర ఉంటే బాగుంటుందని మనసులో అనుకొన్నాను. కానీ వారు ఎవ్వరినీ ఫోటోలను తీయనీయ్యరు. ఇప్పుడు ఎలా అని అనుకొంటూ ఉండగానే వారి అనుచరులు ఒక మాగజైన్‌ను నా చేతిలో పెట్టారు. దాని మీద వారి ఫోటో ఉన్నది. దాంతో నాకు చాలా ఆనందమనిపించింది.

ఇంకొక సందర్భంలో దేవరాజ మొదలియార్ గారిచే అంగ్లములో రచింపబడిన “డే బై డే విత్ భగవాన్” అనే పుస్తకాన్ని మన రమణకేంద్రం భక్తులైన శ్రీరామ్ మూర్తిగారు “శ్రీభగవాన్‌తో దినదినము” అనే శీర్షికతో తెలుగులోకి తర్జుమా చేశారు. అది మన కేంద్రం తరుపున శ్రీరమణాశ్రమ ప్రచురణగా ప్రచురితమైనది. ఆ పుస్తకాన్ని శ్రీ భగవాన్ జయంతి రోజున శ్రీ రమణాశ్రమం వారు ఆవిష్కరించాలని ముహూర్తం నిర్ణయించారు. శ్రీరమణ జయంతికి

గాని, కార్తీక దీపోత్సవానికి గాని, ఆరాధనా దినోత్సవం జరిగే రోజులలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి శ్రీరమణాశ్రమం వారిని ఏ విధంగాను ఇబ్బంది పెట్టకూడదు అనేది డా. కే.యస్. గారి అభిప్రాయం. కానీ నా శ్రీమతికి ఒక్కసారైనా ఈ ఉత్సవాలలో పాల్గొనాలనేది ఆమె కోరిక. నాకు డా.కే.యస్. గారి మాట అంటే గౌరవం. వారి మాటను జవదాటటం నాకు ఇష్టం ఉండదు. అందువల్ల నేనేమి మాట్లాడలేదు. ఈ విషయాన్ని ఎవ్వరితోనూ ప్రస్తావించలేదు. భక్తుల మొర భగవాన్ ఆలకిస్తారు అనటానికి సాక్ష్యం నేను ఇప్పుడు చెప్పబోయే సంఘటన. శ్రీ రమణాశ్రమం వారు మన కేంద్రానికి ఫోన్ చేసి శ్రీరమణ కేంద్రం తరపున ఎవరైన ఇద్దరు వ్యక్తులు కొన్ని పుస్తకాలను వారితో తీసుకొని వచ్చి ఆ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అప్పుడు డా.కే.యస్. గారు ఎవరెవరినైతే అడిగినారో, వారందరికి వివిధ కారణాల వల్ల వెళ్ళటానికి వీలుకాక పోవటంతో శ్రీహరిరావుగారు, పద్మ మోహన రావుగారు మరియు రమణయ్యగారు మా ఇంటికొచ్చి మన కేంద్రం తరపున మీరు వెళ్తారా? అని నన్ను అడిగారు. అది విన్న నా శ్రీమతి, తనని కూడా రావటానికి అనుమతిస్తారేమో కనుక్కోమని నన్ను పురమాయించింది. నా శ్రీమతి కూడా నాతో రావచ్చా అని అడిగితే మీరిద్దరూ వెళ్ళవచ్చు అని అనటంతో నా శ్రీమతి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మన కేంద్రం వారే రానుపోనూ ట్రైన్ టికెట్లను ఇప్పించి కేంద్రం తరపున పంపించారు. ఈ సంఘటనను తలచుకొన్నప్పుడల్లా భగవాన్ అనుగ్రహం మా మీద

ఎంతగా ఉన్నదో అని పొంగిపోతూ ఉంటాము.

స్వామి వివేకానందుల వారి ప్రవచనాలు నా జీవితంలో ఎంతో ప్రభావం చూపాయి. అందువల్లే నా కొడుకు పేరు వివేక్ అని కూతురికి నివేదిత అని పేర్లు పెట్టాను. స్వామి వివేకానందుల వారు ధ్యానం చేసుకొంటున్న ఫోటో నా దగ్గర ఉండాలని చాల ప్రయత్నించాను. కానీ ఆ ఫోటో దొరకలేదు. కే.యస్.గారి మాటలను వినాలనే కుతూహలం ప్రతీ ఒక్క రమణ కేంద్రం భక్తులను ఉన్నట్టే నాకు కూడా ఉండేది. దాంతో వారి మాటలను వినటానికి ఏదో ఒక పని విషయంగా వారింటికి వెళ్ళేవాడిని. వారికి నా వాలకం తెలుసు కాబట్టి ఒక తండ్రిలా వారు నన్ను ఏమి అనే వారు కాదు. అలా ఒక రోజు నేను వారితో మాట్లాడి వస్తున్నప్పుడు నన్ను ఒక్క నిమిషం ఆగమని చెప్పి ఇంట్లోకి వెళ్లి ఏదో తెచ్చి నా చేతిలో పెట్టారు. దాన్ని చూసి నేను ఆశ్చర్యపోయాను. అది నేను ఎప్పట్నుంచో ఎక్కడా దొరకటం లేదని ఎదురు చూస్తున్న స్వామి వివేకానందుల వారి ధ్యానం చేసుకొనే ఫోటో. అది కూడా కే.యస్. గారి చేతుల మీదుగా తీసుకోవటం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

ఒకసారి శ్రీ కేశవ్ రెడ్డిగారు ఉదయం ఐదు గంటల సమయంలో నాకు ఫోన్ చేసి జిన్నూరి నాన్నగారు మాదాపూర్ లోని లక్ష్మిగారింట్లో బస చేశారు. నాన్నగారు ఉదయం ఆరుగంటల నుండి ఏడు గంటలవరకు భక్తులకు దర్శనమిస్తారు. మీకు రావటానికి వీలవుతుందా అని అడిగారు. నాతోపాటు నా శ్రీమతిని కూడా తీసుకొని రావచ్చా అని వారిని అడిగితే, తప్పకుండా అని

చెప్పటంతో నేను, నా శ్రీమతి వారింటికి వెళ్ళాము. రమణయ్యగారు మరియు వారి శ్రీమతి కూడా వారింటికి రావటంతో మేమైదుగురం కలసి కేశవ్‌రెడ్డిగారి కారులో లక్ష్మి గారింటికి వెళ్ళేటప్పటికే ఆరు గంటలయ్యింది. అప్పటికే హాలంతా భక్తులతో నిండిపోవటంతో మేము హాలులో ఒక మూలన నిలబడి వారిని దర్శించుకొంటూ ఉన్నాము. ఆ సమయంలో నాకొక కోరిక కలిగింది. అదేమిటంటే నాన్నగారు నన్ను పలకరిస్తే బాగుంటుంది అని. కానీ అంత పెద్ద వారు మనతో మాట్లాడటం కుదరకపోవచ్చు అని అనుకొన్నాను. ఏడు గంటలకు దర్శనం పూర్తైన తరువాత వారు ఆ గదిని వీడి వెళ్ళిపోతూ నేను ఉన్న ప్రదేశాన్ని దాటి ఒక్క నాలుగడుగులు ముందుకు వేసి, మరల వెనక్కి వచ్చి నా భుజాల మీద చేతులు వేసి ఐదు నిమిషములు మాట్లాడటమే కాకుండా ఈ రోజు మీ ఇంటికి కూడా వస్తాను అని చెప్పటంతో నాకు చెప్పలేని ఆనందం కలిగింది. కానీ వారిలాంటి గొప్పవారు మా ఇంటికి వస్తామంటే వారిని ఎలా ఆహ్వానించాలో, ఎలాంటి ఆతిథ్యమియ్యాలో తెలియదు. దాంతో నేను రమణయ్యగారితో ఈ విషయం చెప్తే, వారు నాకు ధైర్యాన్ని చెప్పి మీరేమి ఇబ్బంది పడనక్కర్లేదు. ఆ విషయాలన్నీ నేను దగ్గరుండి చూసుకొంటాను అని అనటంతో ధైర్యం వచ్చింది. కానీ మా ఇల్లు చాలా చిన్నది. ఎంత లేదన్నా నాన్నగారితో ఒక 20 నుండి 25 మంది వస్తారు. వారందరికి ఎలా ఆతిథ్యమియ్యాలి అని నేను కొంత ఆందోళన చెందాను. కానీ రమణయ్య గారు ఉండటంతో ఈ వ్యవహారం చాలా ప్రశాంతంగా జరిగిపోయింది. అప్పటికి కొన్ని రోజుల క్రితమే మా అమ్మాయి

అమెరికా నుండి వచ్చింది. నాన్నగారు మా ఇంటికి వచ్చారు కనుక వారి చేత మా మనుమరాలికి అక్షరాభ్యాసం చేయిస్తే బాగుంటుందని రమణయ్యగారితో చెబితే, ఏమి ఇబ్బంది లేదు అని అనటంతో నాన్నగారి చేతుల మీదుగా మా మనుమరాలికి అక్షరాభ్యాసం జరిగింది. వారి చేతుల మీదుగా మా మనుమరాలికి అక్షరాభ్యాసం జరగటం మా మనుమరాలు చేసుకొన్న అదృష్టంగా మేము భావిస్తాము.

ఇలా శ్రీరమణ కేంద్రంలోని అందరి సహకారము నాకు ఎన్నో విషయాలలో అందింది. శ్రీ ఏ.వి. రమణయ్యగారు అన్ని విషయాలలో నాకు మార్గదర్శకులు. ప్రతి చిన్న విషయాన్ని కూడా నేను వారితో సంప్రతిస్తాను. వారు ఎంతో ఓపికతో అన్ని విషయాలు నాకు అర్థమయ్యేలా చెప్తారు. వారికి నేనెంతో కృతజ్ఞుడిని. శ్రీరామ్ కిషన్ గారితో కలిసి చాలా సంవత్సరాలు పేదవారికి ప్రసాద వితరణ జరిపే కార్యక్రమంలో పాలు పంచుకొనే వాడిని. వారికి కూడా నా కృతజ్ఞతలు. శ్రీరమణ కేంద్రం ద్వారా, కేంద్రం భక్తుల ద్వారా చాలా విషయాలు నేను నేర్చుకొన్నాను. అందువల్ల శ్రీరమణ కేంద్రానికి వచ్చే రమణ భక్తులందరికీ నా కృతజ్ఞతలు.

భగవాన్ అనుగ్రహంతో శ్రీరమణ కేంద్రములో వాలంటీర్‌గా, సెక్రటరీగా మరియు సంపాదకులుగా సేవ చేసే సౌభాగ్యాన్ని శ్రీ భగవాన్ నాకు కల్పించినందుకు, భగవాన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ

ఓం నమో భగవతే శ్రీరమణా.

# Parikshit

(Talk 3 B)

Dr K Subrahmanian

Today, I would like to talk to you about King Parikshit. Why was he called Parikshit? As you know, Dronacharya's son, Ashwatthama, was angry that the Pandavas had killed his father. To avenge his father's death, the angry son released an arrow to destroy all the remaining Pandavas. Lord Krishna, if he wanted to, could have prevented the destruction from taking place. But he didn't, for the power of Ashwatthama's *astra* was such that Krishna felt that he should not interfere. As a result, all the Pandavas, with the exception of Parikshit, died. Parikshit was still in his mother's womb. He was the only person who managed to survive. But he was a stillborn child. How was he to be revived? There was a lengthy discussion among the many *jnanis* present about how the stillborn child could be brought back to life. Somebody said, "If the baby is touched by a *nitya brahmachari*, it will come back to life."

Although all the *jnanis* present heard this, there was no volunteer from among them to touch the child. None of the great *rishis* got up to say, "I will touch the child for I am a *nitya brahmachari*." Instead, they openly declared they were not *nitya brahmacharis*. As the discussion went on, one of the great devotees of Krishna suggested, "Let Krishna touch the child. Then it will come back to life." The majority of the people present laughed, and said, "You are talking of Krishna as a *nitya brahmachari*! How can

you call him that?” Everyone had heard a great deal about Krishna and the *gopis*. They didn’t think that such an individual could be a *nitya brahmachari*. Krishna, on the other hand, did not say anything; he merely listened. As the situation was desperate, some of the *rishis* said, “All right! Let us give Krishna a chance. Let him touch the child.” Everyone appealed to him to touch the child, and when he did, Abhimanyu’s son came to life. The child that owed his life to the Lord was Parikshit. When he was in the womb, Parikshit was able to see Krishna because it was Krishna who entered the womb to prevent the complete destruction of the child. So, when Parikshit came out, and Krishna touched him, he looked at everybody to find out who it was that had entered when he was in his mother’s womb. He did this *pariksha*, and that’s why he was called Parikshit. The *pariksha* was, “Who was it that came to me?” Then of course, he recognised Krishna.

